# దోపిడీ

ఇంకా పూర్తి తెల్లవారలేదు.

"సార్!" అంటూ మెల్లగా మునివేళ్ళతో తలుపు కొట్టిన చప్పుడు.

పాలవాడైతే నన్ను పిలవడు. పేపర్ వాడయితే ఎవర్నీ పిలవడు. 'మరెవరో అయి ఉండవచ్చు' అనుకుంటూ మంచం మీదనుంచీ లేచి తలుపు తెరిచాను.

ఎదురుగా చేతిలో పాతికేళ్ళ కుర్రాడు.

"నమస్కారం మాస్టారూ" అంటూ నిటారుగా నిల్చొని నా ముఖంలోకి చూస్తున్నాడు.

ఆ అబ్బాయి ముఖంలోకి ఎంత పరిశీలనగా చూసినా గుర్తు చిక్కలేదు.

నా భావాన్ని అర్థం చేసుకున్నాడేమో- "నేను మీకు గుర్తురానట్టుంది కదండీ! కడప రచయితల సభల్లో నేను మిమ్మల్ని కలుసుకున్నాను...." అన్నాడు.

అప్పటికీ గుర్తు రాలేదు. రచయితల సభలకెళ్ళినప్పుడు ఎందరో కలుస్తారు. పలుకరిస్తారు. అందర్నీ గుర్తుంచుకోవటం నాబోటి వయసు మళ్ళిన వారికి సాధ్యంగాదు.

"లోపలకురా అబ్బాయ్" అన్నాను. అతడు నా వెనకాలే లోపలకు వచ్చాడు. ఓ పేము కుర్చీలో కూర్చుంటూ, ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాను. ఈ కుర్రాడు ఇంత పెందరాళే ఎందుకొచ్చాడో నాకు అంతుబట్టడం లేదు.

అతడు కుర్చీలో వినయంగా కూచుని, "మీరు ఇప్పుడే నిద్ర లేస్తున్నట్టున్నారు. పని తొందరవల్ల మిమ్మల్ని పెందరాళే కలవాల్సి వచ్చింది. మీ కాలకృత్యాలు కానివ్వండిసార్! తీరిగ్గా మాట్లాడుకుందాం" అన్నాడు.

మా మాటలు వినిపించాయేమో శ్రీమతి కూడా లోపల్నుంచి వచ్చింది. ఆ కుర్రాడు కుర్చీలోంచి లేచి "నమస్కారమండీ" అన్నాడు ఆమెతో. ఆ నమస్కారాన్ని స్వీకరించి ఆమె కూడా కొంత ఇబ్బందిలో పడిపోయింది.

అతన్ని ఆమెకు పరిచయం చేశాను.

ఇంతలో పాలవాడు వచ్చి పాలుపోసి వెళ్ళాడు.

"మీరు బాత్ రూమ్ వెళ్ళిరండి మాస్టారూ...." అన్నాడు ఆ అబ్బాయి.

నేను బాత్ రూమ్‌లోకి, ఆవిడ వంటింట్లోకీ నడిచాము.

రచయితలసభల్లో పరిచయాన్ని పురస్కరించుకొని వచ్చాడు కాబట్టి నన్ను ఏ ఉపన్యాసానికో పిలవటానికి ఇతడు వచ్చి ఉండవచ్చు అన్న నిర్ణయానికి నేను వచ్చాను. ఈ మధ్య సాహిత్యోపన్యాసం ఇవ్వటమంటే నాకు బాగా విరక్తి పుట్టింది. ఉపన్యాసానికి పిలిచేవాళ్ళపని ఎప్పుడూ చాలా తేలికగా ఉంటుంది. ఎటొచ్చీ మాట్లాడే వానికే పని. నా మట్టుకు నాకు

ఉపన్యాసమివ్వడమంటే ఒక పెద్ద బరువు నెత్తిన ఎత్తుకున్నట్టుగా ఉంటుంది. మాటాడే సబ్జక్టును గురించి, తెలిసిందే అయినా, చక్కగా ప్రిపేర్ కావాలి. అంశాల్ని ప్రోగు చేసుకోవాలి. ఏదో పిలిచారుగదా అని నోటికొచ్చినట్టు ఏది పడితే అది అప్పటికప్పుడు నిర్ణయించుకొని మాట్లాడేసేయటం నా కిష్టం ఉండదు. సబ్జక్టును బాగాస్టడీ చేసి మాట్లాడితేనే నాకు తృప్తి. అది న్యాయం కూడా....అయితే ఇందులో చాలా కష్టం ఉంది. ఉపన్యాసానికి పిలిచి వెళ్ళినప్పట్నుంచీ, అదే అంశం మనసులో మెదలుతూ ఉంటుంది. అదో టెన్షన్! మాటాడేది గంటే అయినా అది కొన్ని రోజులు పీడిస్తుంది. ఇక ఏ పందమైళ్లో ప్రయాణం చేసే సందర్భాల్లో అయితే అదో బాదరబందీ. కొత్తచోట ఓ రోజు ఉండటమూ, తిరుగుప్రయాణమూ- ఇదంతా సుఖమైన విషయం కాదు. తీరా మనం మాట్లాడే చోటుకు వెళితే అక్కడో పాతికమంది ఉంటారు. వాళ్ళయినా ఉబుసుపోకకు వస్తారు. అలా వినేసి ఇలా వెళ్తారు. సాధించే ప్రయోజనం చాలాతక్కువ. పడే శ్రమా తతంగమూ చూస్తే ఎక్కువ. అందువల్ల ఈ మధ్య ఉపన్యాసాలంటే భయం పుట్టుకొస్తూంది. తప్పించుకోవటంలోనే హాయి ఉంటోంది.... ఈ అబ్బాయి ఉపన్యాసానికే పిలిచే పక్షంలో ఏం చెప్పి తప్పించుకోవాలా అని అన్వేషణ మొదలు పెట్టాను.

బాత్‌రూమ్‌లోంచి బయటికి వచ్చి ముఖం తుడుచుకుంటూ మొదటి గదిలోకి వచ్చాను. అతడు పేపర్ చూస్తున్నాడు. నేను ఎదురుగా కూర్చున్నాను. మా చిన్నమ్మాయి కాఫీలు తెచ్చి ఇచ్చింది.

కొత్త మనుషులతో ఉబుసుపోకకు మాటలు ప్రారంభించటం నాకు చాతకాదు. ఆ అబ్బాయే మాటాడుతాడని ఆశిస్తూ కాఫీ త్రాగుతున్నాను. అతడు కాఫీ తాగి కప్పు ఓ పక్కగా ఉంచి, తన చేతి బాగ్ తీసుకొని దాని జిప్ తెరిచి ఓ అచ్చు పుస్తకాన్ని బయటకు తీశాడు. అది ముందూ

వెనకా అట్టలు లేకుండా బోసిగా ఉంది. దాన్ని నా చేతికందిస్తూ "ఇది నా కథల సంపుటి మాస్టారూ'' అన్నాడు. మొత్తం పండ్రెండు కథలు. ఇందులో కొన్ని పత్రికల్లో అచ్చయ్యాయి. ఈ సంకలనాన్ని సొంతంగా అచ్చు వేయించాను. విజయవాడలో అచ్చు వేయించాను. ఇంకా గెటప్ పూర్తి కాలేదు. మీతో 'ముందుమాట' రాయిద్దామని తీసుకొచ్చాను. కథా సంపుటికి "దోపిడీ' అని పేరుంచాను....

ఉపన్యాసానికి పిలవటం లాంటిది లేనందుకు చాలా ఆనందించినా, అంతకంటె బరువయిన పని అప్ప చెప్పుతున్నందుకు దిగులేసింది.

ఆ పుస్తకం అందుకుని పేజీలు అటూ యిటూ తిప్పసాగాను. పుస్తకం నూరు పుటలకు పైగా వుంది.... చిన్న ప్రింటు....

"కడపలో మిమ్మల్ని కలిసినప్పుడు మీతో ఈ ప్రస్తావన తెచ్చాను. మీకు గుర్తుండే ఉండాలి. అలాగే కానీ అబ్బాయ్.... చూద్దాం.... అన్నారు అప్పుడు మీరు.... మీపట్ల, మీ రచనల పట్ల మొదట్నుంచి నాకు గౌరవం ఉంది. నాకథలకు మీతో ముందుమాట రాయించాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను....'' ఇలా అతడు చెప్పుకు పోతున్నాడు.

అతని కథలకు నేను ముందుమాట రాయటం అప్పుడే నేనొప్పు కున్నానన్నమాట.... అతడు ఆప్రస్తావన తెచ్చిన విషయం కొద్ది కొద్దిగా గుర్తుకొస్తూంది. ఇక ఇప్పుడు నేను ఏ అభ్యంతరమూ చెప్పటానికి వీల్లేదన్నమాట! పుస్తకాలకు ముందుమాట రాయటం ఒక హాబీ గా ఉన్నవాళ్లు దేశంలో కొందరు లేక పోలేదు. చదవకుండా కూడా రాయగల జ్ఞాన సంపన్నులూ ఉన్నారు. అలాపైపైన తిరగేసి రాయగల అఖండులూ ఉన్నారు. నేనూ ఇంతకు మునుపు నాలుగైదు పుస్తకాలకు రాసినమాట నిజమే కాని, ఆ రాయటం మహా బాధ్యతతో కూడుకున్న పని. మొహ

మాటం కోసం నచ్చకపోయినా నచ్చినట్టు రాయటంవల్ల జరిగే మంచికన్న కీడే ఎక్కువ. అది సాహిత్యనేరం కూడా. అందువల్ల నచ్చితేనే నేను రాస్తాను.

"చదివిం తర్వాతగాని నేను ఏమాటా చెప్పలేనబ్బాయ్.... " అన్నాను అతడితో.

"మీరు చదవండి మాస్టారూ! చదివింతర్వాత మీకెలా అనిపిస్తే అలా రాయండి. మీ అభిప్రాయాల్ని చాలా విలువైనవిగా నేను భావిస్తాను." అన్నాడతడు.

ఆ మాటకు నేను కట్టుబడిపోయాను.

"మీరు సాధ్యమైనంత తొందరగా రాసి ఈ కవర్లో పెట్టి పోస్టు చేయండి మీ అభిప్రాయం అందే వరకూ 'గెటప్' పూర్తి కాదు. మీ ముందు మాట కోసం ఎదురుచూస్తూ ఉంటాను." అంటూ తన అడ్రెస్ రాసిన ఒక కవరు నాచేతికందించాడు.

మరో పదినిమిషాలుండి అతడు వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు "పుస్తకప్రచురణ పూర్తి కాగానే నేను స్వయంగా వచ్చి మీకు పుస్తకం ఇస్తాను" అన్నాడు.

ఆ రాత్రే ఆ పుస్తకం ముందేసుకూర్చున్నాను.

చాలా ఓపికగానూ, కష్టంగానూ, బాధపడుతూనూ, కథలన్నిటినీ చదివేశాను.

కథలన్నీ చదివాక వాటి గురించి ఏం రాయాలో బోధపడక సందిగ్ధంలో పడిపోయాను.

అందులో ఎక్కువ భాగం కథలు ''సెక్స్‌దోపిడీ''కి సంబంధించినవి. అవన్నీ విప్లవకథలని ఆ కథకుడి అభిప్రాయంలా ఉంది. కథల్నిండా బోలెడు విప్లవ పదజాలం గుప్పించేశాడు. విప్లవమంటే మనుషుల్ని చంపేసేయటమే అన్న తేలిక అభిప్రాయం రచయితకు బలంగా ఉన్నట్టుంది. ఇలాంటి రచయితలకు సులభంగా రాయదగ్గ వస్తువు ''సెక్స్‌దోపిడీ'' సెక్స్ గురించి రాయటానికి ఏ జీవితానుభవమూ అవసరం లేదు. ఒక భూకామందో, ఒక ఫ్యాక్టరీ యజమానో, ఓ పెద్ద ఆఫీసరో ఒక అమ్మాయిని చెరచినట్టూ, ఆ అమ్మాయి ప్రియుడో, అన్నో, తమ్ముడో వాణ్ణి ఖతం చేసినట్టూ, రాయటానికి ఏ జీవితానుభవం కావాలి? కథల్లో కావాల్సినంత సెక్స్ వర్ణననూ పొదిగించవచ్చు. పడికట్టు విప్లవపదాన్ని గుప్పించేయవచ్చు. కథకు విప్లవరంగూ పులమవచ్చు. ఈ ధోరణి ఏమాత్రమూ ఆరోగ్యకరమైంది కాదు. పైపెచ్చు ప్రమాదకరమైనది కూడా! పాఠకుల్ని తప్పుదారి పట్టించేది కూడా! ఇక ఆ కథల్లోని భాషా, శైలీ, చాలా కృతకంగా ఉంది. ఇలాంటి కథల మీద ఎంతైనా రాయటం అవసరం. ఆ రచయితలకు నచ్చకపోనీ నా అభిప్రాయాన్ని సహేతుకంగా వివరించటం బాధ్యత.

మొత్తం సంపుటిలో రెండు కథలు మాత్రమే కొంత బాగున్నాయి. మధ్యతరగతి రైతు దుర్భర జీవితాన్ని చిత్రించే కథ ఒకటి. నిరుద్యోగ సమస్య గురించి ఒకటి. అందులోనూ వైవిధ్యం లేకపోయినా, మరీ నాసిరకం అనిపించేలా లేవు. రచయిత ప్రతిభ ఆ కథల్లో కొంచెం కనిపిస్తుంది.

నాలుగైదురోజులు ఆ కథల్ని గురించే ఆలోచిస్తూండిపోయాను.

ఆ తర్వాత రెండురోజులు ఆ కథలకు ముందుమాట రాశాను. ఆకథలమీద నాఅభిప్రాయాల్ని నిష్కర్షగా రాశాను. ఆ కథల్లో ఎక్కడ

బలహీనత ఉందో, రచయిత అవగాహనలో ఎక్కడ లోపం ఉందో వివరంగా చెప్పాను. రచయిత ముందు ముందు ఎలాటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా సూచించాను.

బావున్నవని నాకనిపించిన రెండు కధల్నీ మెచ్చుకుంటూ రాశాను. ఆ కధల్లో రచయిత కనబరచిన శ్రద్ధను వివరించాను. ఇలాంటి కధల్ని ముందు ముందు రాస్తే రచయిత ప్రతిభ వికసించవచ్చునని కూడా తెలిపాను. ఆ రెండు కధలూ బావుండటానికి గల కారణాల్ని కూడా చెప్పాను.

దాదాపు ఆరు పేజీలు రాశాను,

అతడిచ్చిన కవరులో పెట్టి దాన్ని పోస్టు చేసి నా బాధ్యత తీరినందుకు తీరిగ్గా వూపిరి పీల్చుకున్నాను.

ఇది జరిగి ఇప్పటికి మూడు నెలలయింది.

ముందుమాట రాసిపంపిన తర్వాత అతన్నుంచి పుస్తకం వస్తుందని ఆశించాను. స్వయంగానో, లేక పోస్టుద్వారానో పుస్తకం రావచ్చుననుకున్నాను బహుశా గెటప్ పూర్తి కావటానికి ఆలశ్యం జరిగివుండవచ్చు అనుకున్నాను. లేదా నా ముందుమాట నచ్చక అచ్చు వేసుకొని వుండకపోవచ్చు అనికూడా భావించాను.

ఆరోజు సాయంత్రం కాలేజినుంచి వస్తూ, దారిలో ఉన్న 'బుక్ హవుస్' కెళ్ళాను. అప్పుడప్పుడు పుస్తకాల షాపుకెళ్ళి, ఆమధ్యన వచ్చిన పుస్తకాల్ని పరిశీలించి, నచ్చిన వాటిని కొనటం నా అలవాటు.

రాక్స్‌లో పుస్తకాల్ని చూస్తున్నాను. నాదృష్టి అకస్మాత్తుగా ఆగిపోయింది. "దోపిడీ" అన్న పేరుతో పుస్తకం కనిపించేసరికి నాకాశ్చర్యం వేసింది. ఈ పుస్తకం అప్పుడే మార్కెట్‌లోకి కూడా వచ్చిందే! నాకెందుకు

గాను పంపలేమ?.... ఆలోచిస్తూ ఆపుస్తకాన్ని చేతుల్లోకి తీసుకున్నాను. ఎర్రటి రంగులో ఉన్న అట్ట మీద పెద్ద అక్షరాలతో 'దోపిడీ' అన్న పుస్తకం పేరూ, ఆ రచయిత పేరూ, కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.... అట్ట తెరిచాను.... మొదటి పేజీలో మళ్ళీ అవే అక్షరాలు.... మరోపుట తెరిచాను. విషయసూచిక. మొదట్లోనే ముందుమాట, దానికెదురుగా నాపేరూ.... ఆసక్తితో పుట తిప్పాను. నేను రాసిన ముందుమాట కొంచెం పెద్ద అక్షరాలతో అచ్చు వేశారు. రెండు వాక్యాలు చదవగానే దిగ్భ్రాంతి చెందాను. వెంటనే పేజీతిప్పాను. నేను రాసిన ఆరుపేజీల పీఠిక ఒకటిన్నర పేజీలోనే ముగిసి ఉంది. చకచకా చదివాను. మహా ఆశ్చర్యం! నేను ఏకథలనయితే విమర్శిస్తూ రాశానో ఆ పేరాలు ఒక్కటి కూడా అందులో లేవు. నేను ఏ రెండు కథల్నయితే మెచ్చుకుంటూ రాశానో, ఆ రెండుపేరాలు మాత్రం శుభ్రంగా అచ్చువేసుకున్నాడు. ముందూ వెనకా రెండు మంచి వాక్యాల్ని అతికించాడు. ''ముందు ముందయినా రచయిత మంచి కథలు రాస్తాడని ఆశిద్దాం'' అని నేను చివరి వాక్యం రాస్తే, ''ముందు ముందు రచయిత ఇంకా మంచి కథలు రాస్తాడని ఆశిద్దాం'' అని మార్పు చేశాడు. నేను నిశ్చేష్టుడ్నే అయ్యాను. పట్టరానికోపంతో కొంతసేపు చలించిపోయాను.

నేను మామూలు స్థితికి రావటానికి పదినిమిషాలు పట్టింది.

అసహ్యంతో ఆపుస్తకాన్ని ర్యాక్‌లో పెట్టేశాను.

పుస్తకాలషాపునుండి బయటకు వచ్చేస్తూ, ఆకథల సంపుటి పేరు గుర్తు తెచ్చుకుని, ''దోపిడీ'' అనుకుంటూ విషాదంగా నవ్వుకున్నాను.

*

( ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక 27 - 6 - 84 )